క్లుప్తంగా

ప్రమాదకరంగా కేబుల్ తీగలు



గోపాలపట్నం ధరణి అపార్ట్‌మెంట్ వద్ద ప్రమాదకరంగా కేబుల్ తీగలు

గోపాలపట్నం: గోపాలపట్నం ప్రధాన రహదారిలో ధరణి అపార్ట్‌మెంట్ వద్ద కేబుల్ తీగలు ప్రమాదకరంగా ఉన్నాయి. విద్యుత్ స్తంభాలకు కట్టిన తీగలు దిగువకు వాలిపోయాయి. అపార్ట్‌మెంట్ లోపలికి వెళ్లే వారి తల, మెడకు తగలంతో ప్రమాదాల బారిన పడుతున్నామని వాపోతున్నారు. అధికారులు స్పందించి తీగలు తొలగించడంతో పాటు నిర్వాహకులపై తగిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన

మల్కాపురం: రోడ్డు ప్రమాదాల నుంచి ఎలా తప్పించుకోవాలన్న అంశంపై ట్రాఫిక్ ఏడీసీపీ ఆదేశాల మేరకు మల్కాపురం ట్రాఫిక్ పోలీసులు గురువారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. పాఠశాల విద్యార్థులు, స్థానిక ఆటో డ్రైవర్లతో కలిసి మల్కాపురం నుంచి శ్రీహరిపురం వరకు ట్రాఫిక్ నిబంధనలను వివరిస్తూ అవగాహన ర్యాలీ చేపట్టారు. హార్బర్ ట్రాఫిక్ సీఐ షణ్ముఖరావు, మల్కాపురం ఎస్‌ఐ అప్పారావు ప్రమాదాలు జరగకుండా వాహనదారులు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. రోడ్డు దాటేటప్పుడు పాదచారులు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. ప్రతి ఒక్కరూ విధిగా ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని సూచించారు.

బీజేపీ ఎస్సీ మోర్చా జోనల్ ఇన్‌చార్జిగా ప్రకాష్



సింధియా: జీవీఎంసీ 62వ వార్డు ప్రాంతానికి చెందిన బీజేపీ నాయకుడు ములకలపల్లి ప్రకాష్ ఎస్సీ మోర్చా ఉత్తరాంధ్ర జిల్లాల జోనల్ ఇన్‌చార్జిగా నియమితులయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీజేపీ ఎస్సీ మోర్చా అరకు పార్లమెంట్ ఇన్‌చార్జి అందించిన సేవలను గుర్తించి ఎస్సీ మోర్చా ఉత్తరాంధ్ర జిల్లాల జోనల్ ఇన్‌చార్జిగా బాధ్యతలు అప్పగించారన్నారు. తనకు ఇచ్చిన బాధ్యతను పూర్తి స్థాయిలో నిర్వర్తిస్తానని చెప్పారు. పార్టీ నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు.

దేశ ఆర్థిక ప్రగతికి కార్మికులే కీలకం



దీక్ష శిబిరంలో మాట్లాడుతున్న పోరాట కమిటీ నాయకులు

కూర్మన్నపాలెం: సర్వోన్నతమైన దేశ ఆర్థిక ప్రగతికి కార్మికులే కీలకమని, అటువంటి కార్మికులను పట్టించుకోకుండా కేంద్ర ప్రభుత్వం ఇష్టానుసారం ప్రభుత్వరంగ సంస్థలను ప్రైవేట్ వ్యక్తులకు అమ్ముకుంటూ పోవడం సరికాదని ఉక్కు పరిరక్షణ, పోరాట కమిటీ నాయకులు విమర్శించారు. కార్మికులను విస్మరించిన ఏ ప్రభుత్వం బాగుపడలేదన్నారు. కూర్మన్నపాలెం కూడలిలోని స్టీల్‌ప్లాంట్ ఆర్చి వద్ద జరుగుతున్న రిలే నిరాహార దీక్షల్లో 1078వ రోజు గురువారం, సంస్థకు చెందిన పలువురు కార్మికులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం స్టీల్‌ప్లాంట్‌ను 100 శాతం అమ్మాలనే నిర్ణయాన్ని తక్షణమే విరమించుకోవాలన్నారు. కార్మికులకు ఆర్థిక, సామాజిక న్యాయం చేస్తున్న విశాఖ ఉక్కు కర్మాగారాన్ని కాపాడుకోవడానికి, కేంద్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయానికి వ్యతిరేకంగా రాష్ట్రంలోని ప్రజలందరూ ఆందోళనలు చేయాల్సిన సమయం ఆసన్నమైందన్నారు. కార్యక్రమంలో పోరాట కమిటీ నాయకులు, ఇతర కార్మికులు పాల్గొన్నారు.

ఓటర్లలో చైతన్యం నింపేలా..

- ఘనంగా జాతీయ ఓటర్ల దినోత్సవం
- సీనియర్ ఓటర్లకు సన్మానం



కార్యక్రమంలో మాట్లాడుతున్న బెహరా విజయ చైతన్య



సీనియర్ ఓటర్లను సన్మానిస్తున్న ఆర్డీవో హుస్సేన్ సాహెబ్, ఎమ్మెల్యే గణబాబు, డిప్యూటీ మేయర్ శ్రీధర్

విశాఖ విద్య: జాతీయ ఓటర్ల దినోత్సవం సందర్భంగా ఓటర్లలో చైతన్యం నింపేలా 90వ వార్డు బుచ్చిరాజుపాలెం సెంటర్ నుంచి 52వ వార్డు శాంతినగర్ వరకు గురువారం భారీ ర్యాలీ నిర్వహించారు. పశ్చిమ నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి, విశాఖ ఆర్డీవో హుస్సేన్ సాహెబ్, ఎమ్మెల్యే గణబాబు, డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్, మార్కెట్ కమిటీ చైర్మన్ బీఎస్ కృష్ణ ర్యాలీలో పాల్గొన్నారు. ఓటర్లను చైతన్య పరిచేలా ర్యాలీలో ముందు వరుసలో నిలిచి అధికారులు, సచివాలయ ఉద్యోగులతో కలిసి నడిచారు. శాంతినగర్ కమ్యూనిటీ హాల్లో నిర్వహించిన సమావేశంలో ఆర్డీవో హుస్సేన్ సాహెబ్ అందరితో ఓటు హక్కు వినియోగంపై ప్రతిజ్ఞ చేయించారు. 80 ఏళ్లు దాటిన బొడ్డేటి కొండమ్మ, కొప్పుల వరహాలమ్మను ఈ సందర్భంగా సన్మానించారు. ఎక్కువ సార్లు ఓటు హక్కు వినియోగించుకున్నందుకు నియోజకవర్గంలో ఇలాంటి కార్యక్రమాలు చేపడుతున్నట్లు ఆర్డీవో హుస్సేన్ సాహెబ్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు పశ్చిమ నియోజకవర్గంలో పారదర్శకమైన ఓటరు జాబితాను సిద్ధం చేశామన్నారు. ఓటరు జాబితాలను అన్ని పోలింగ్ స్టేషన్లలో ప్రదర్శించామన్నారు. వీటిని ప్రతి ఒక్కరూ పరిశీలన చేసుకునేలా విస్తృతంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. వచ్చే ఎన్నికల్లో ఓటర్లు అంతా తమ ఓటు హక్కును తప్పనిసరిగా వినియోగించుకోవాలని కోరారు. కార్యక్రమంలో జీవీఎంసీ, 8వ జోన్ కమిషనర్లు ఆర్జీవీ కృష్ణ, ఎం.మల్లయ్యనాయుడు, ఎన్నికల సెల్ డిప్యూటీ తహసీల్దార్ శ్రీనివాసరావు, ఆర్‌ఐ సురేష్‌కుమార్, 90వ వార్డు కార్పొరేటర్ బొమ్మిడి రమణ తదితరులు పాల్గొన్నారు.

ఓటు హక్కు వినియోగించుకోవాలి

గోపాలపట్నం: ఓటు హక్కు కలిగిన ప్రతి ఒక్కరూ ఓటును వినియోగించుకోవాలని బెహరా విద్యాసంస్థల మేనేజింగ్ డైరెక్టర్ బెహరా విజయ చైతన్య అన్నారు. నరవలోని బెహరా విద్యాసంస్థల ప్రాంగణంలో వికసిత్ భారత్‌లో భాగంగా జాతీయ ఓటర్ల దినోత్సవం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ దేశంలో యువత ఎక్కువ శాతం ఉన్నారని అన్నారు. వీరంతా ఓటు హక్కు కలిగి ఉండాలని తెలిపారు. దేశ భవిష్యత్తుకు మూల స్తంభాలుగా నిలబడాని పిలుపునిచ్చారు. మంచి నాయకత్వం అందించే శక్తి నేటి యువతపైనే ఉందన్నారు. కార్యక్రమంలో పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ సుకన్య, నర్సింగ్ కళాశాల ప్రిన్సిపాల్ హిందుమతి, బీజేవైఎం రాష్ట్ర మీడియా కోఆర్డినేటర్ సత్యనరసింహరాజు, నగర వైస్ ప్రెసిడెంట్ విమలేష్ జైన్ పాల్గొన్నారు.

- నరవలోని విశాఖ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇంజినీరింగ్ కళాశాలలో జాతీయ ఓటరు దినోత్సవం నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపాల్ శ్రీధర్ పట్నాయక్ మాట్లాడుతూ ప్రజాస్వామ్యానికి ఓటే ఆయుధంగా ఉంటుందన్నారు.

మల్కాపురం: ఓటుతోనే దేశ భవిత మారుతుందని జిల్లా ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రాం అధికారి ఐ.వి.ఎస్.భాగ్యలక్ష్మి అన్నారు. మల్కాపురం సెయింట్ ఆన్స్ మహిళా కళాశాలలో గురువారం జాతీయ ఓటర్ల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ యువత తమ ఓటు హక్కును సద్వినియోగం చేసుకుని, ఉత్తమ నాయకత్వం ఉన్న వ్యక్తిని ఎన్నుకోవాలన్నారు. ఓటు ఒక వజ్రాయుధం అని, ప్రలోభాలకు లొంగకుండా ఓటు హక్కును ఉపయోగించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు, ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రాం అధికారులు, తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయిస్తున్న అధ్యాపకులు

ఘనంగా పౌర్ణమి పూజలు

కంచరపాలెం: స్థానిక కంచరపాలెం అశోక్‌నగర్ బౌద్ధాలయంలో ఆంధ్ర బౌద్ధ కేంద్ర సమాజం ప్రధాన కార్యదర్శి కె.రాజుగణేష్ ఆధ్వర్యంలో గురువారం పుష్య మాస శుద్ధ పౌర్ణమిని పురస్కరించుకుని సీనియర్ ఉపాసకులు కోన వెంకటరావు ప్రత్యేక పూజలు నిర్వహించారు. పేద మహిళలకు చీరలు పంపిణీ చేశారు. మధ్యాహ్నం పేదలకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో రాజు, భీమారావు, రాము, రామచంద్రరావు, పరిమళ, సునీల్ పాల్గొన్నారు.



వృద్ధులకు చీరలు పంపిణీ చేస్తున్న అతిథులు

గంబూసియా చేపలతో దోమలకు చెక్



నేల బావిలో గంబూసియా వేస్తున్న కార్పొరేటర్ లావణ్య

మల్కాపురం: నీరు నిల్వ ఉండే బావుల్లో గంబూసియా చేపలు వేయడం ద్వారా దోమల వ్యాప్తికి చెక్ పెట్టవచ్చునని జీవీఎంసీ 58వ వార్డు కార్పొరేటర్ లావణ్య అన్నారు. వార్డు పరిధిలోని పలు నేల బావుల్లో గురువారం గంబూసియా చేపలను విడిచి పెట్టారు. నేల బావిలో వీటిని వేయడం వల్ల లార్వాలను నాశనం చేస్తాయన్నారు. కార్యక్రమంలో వార్డు మలేరియా విభాగ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

విశేషంగా పునర్వసు నక్షత్ర హోమం



హోమం నిర్వహిస్తున్న అర్చకులు



సీతారాముల ఉత్సవమూర్తులకు పూజలు నిర్వహిస్తున్న అర్చకులు

సింహాచలం: పునర్వసు నక్షత్రాన్ని పురస్కరించుకుని గురువారం సింహగిరిపై గంధార వద్ద ఉన్న ప్రాచీన రామాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. సీతారామలక్ష్మణ సమేత ఆంజనేయస్వామి ఉత్సవమూర్తులను విశేషంగా అలంకరించి ఆలయ ప్రాంగణంలో వేంచేయజేశారు. హోమగుండం వద్ద విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం, మండపారాధన, హోమం, పూర్ణాహుతి కార్యక్రమాలను ఆలయ స్థానాచార్యులు టి.పి.రాజగోపాల్ తదితరులు ఘనంగా నిర్వహించారు. దేవస్థానం ఈవో శ్రీనివాసమూర్తి, ట్రస్ట్‌బోర్డు సభ్యులు గంట్ల శ్రీనుబాబు, సంపంగి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

రేపటి నుంచి యోగా శిబిరాలు

ఏయూ క్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయం యోగా కేంద్రం ఆధ్వర్యంలో శనివారం నుంచి సాధారణ యోగా, స్థూలకాయ నివారణ యోగా శిబిరాలను నిర్వహించనున్నట్లు కేంద్రం సంచాలకుడు ఆచార్య ఓ.ఎస్.ఆర్.యు.భానుకుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 7 నుంచి 8, ఉదయం 8 నుంచి 9 జనరల్ యోగా తరగతులు, సాయంత్రం 4 నుంచి 5, సాయంత్రం 5 నుంచి 6 గంటల వరకు స్థూలకాయ నివారణ యోగా శిబిరాలు జరుగుతాయన్నారు. ఆసక్తి ఉన్న వారు 94944 01919, 99980 19922 నంబర్లలో సంప్రదించాలన్నారు.

అప్పన్నను దర్శించుకున్న న్యాయశాఖ ముఖ్యకార్యదర్శి

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామిని గురువారం రాష్ట్ర న్యాయశాఖ ముఖ్య కార్యదర్శి సత్య ప్రభాకర్ సతీసమేతంగా దర్శించుకున్నారు. ఆలయంలోని కప్పస్తంభాన్ని ఆలింగనం చేసుకున్నారు. అంతరాలయంలో వారి పేరిట స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించి వేద ఆశీర్వచనం ఇచ్చారు. ఆలయ సంప్రదాయం ప్రకారం స్వామి వారి ప్రసాదాన్ని ఏఈవో భ్రమరాంబ అందజేశారు.



కప్పస్తంభానికి మొక్కుకుంటున్న సత్యప్రభాకర్

గర్వించే స్థాయికి ఏయూ విద్యార్థులు ఎదగాలి

- వీసీ ఆచార్య ప్రసాదరెడ్డి
- ఘనంగా ఎంబీఏ విద్యార్థుల ఫ్రెషర్స్ డే



విద్యార్థులకు బహుమతి అందిస్తున్న వీసీ ప్రసాద రెడ్డి

ఏయూ క్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయం గర్వించే స్థాయికి వర్సిటీ విద్యార్థులు ఎదగాలని వీసీ ఆచార్య ప్రసాదరెడ్డి ఆకాంక్షించారు. గురువారం ఏయూ స్నాతకోత్సవ మందిరంలో ఎంబీఏ విద్యార్థుల ఫ్రెషర్స్ డే వేడుకల్లో ఆయన ముఖ్యఅతిథిగా మాట్లాడారు. వర్సిటీలో ఉండే రెండేళ్ల కాలాన్ని పూర్తిస్థాయిలో సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. విద్యార్థులు పొందే జ్ఞానం వారి ఉన్నతిని నిర్ణయిస్తుందన్నారు. మన లక్ష్యం ఎంత ప్రధానమో.. ప్రయాణించే మార్గం కూడా అంతే ప్రధానమన్నారు. కళాశాలలో ఉండే ప్రతి క్షణాన్ని ఆస్వాదించాలని చెప్పారు. ఏయూ జ్ఞానానికి కేంద్రంగా, ప్రగతికి నిలయంగా ఉందన్నారు. ఏయూ శతాబ్ది ఉత్సవాల్లో ప్రస్తుతం బ్యాచ్ భాగస్వామ్యం కావడం అదృష్టంగా భావించాలన్నారు. ప్రతి విద్యార్థి జాబ్ లెటర్‌తో బయటకు వెళ్లాలని, ఆసక్తి ఉంటే ఎంటర్‌ప్రెన్యూవర్‌గా ఎదగాలన్నారు. ఆర్ట్స్ కామర్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య నరసింహారావు మాట్లాడుతూ ప్రతి విద్యార్థికి ఉపాధి కల్పన లక్ష్యంగా పనిచేస్తున్నామన్నారు. రిజిస్ట్రార్ ఆచార్య ఎం.జేమ్స్ స్టీఫెన్ మాట్లాడుతూ యువత సామాజిక మాధ్యమాలను, సోషల్ మీడియాను సమర్థవంతంగా, తమ అభ్యున్నతికి ఉపయోగించుకోవాలన్నారు. విభాగాధిపతి ఆచార్య జాలాది రవి మాట్లాడుతూ గతేడాది విభాగంలో 23 కార్యక్రమాలను నిర్వహించామని, 78 సంస్థలు ప్రాంగణ నియామకాలు జరిపి 171 మంది విద్యార్థులకు ఉపాధి అవకాశాలు అందించాయన్నారు. అత్యధికంగా తమ విభాగ విద్యార్థి రూ.24 లక్షలు వార్షిక వేతనంతో ఉద్యోగాన్ని సాధించారన్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన వివిధ పోటీల విజేతలకు వీసీ ప్రసాదరెడ్డి బహుమతులు ప్రదానం చేశారు. విద్యార్థినుల శాస్త్రీయ నృత్య ప్రదర్శన అలరించింది.

ఆరోగ్య రక్ష..!

- జగనన్న ఆరోగ్య సురక్షతో చెంతనే వైద్యం
- బుచ్చిరాజుపాలెంలో ప్రత్యేక వైద్యశిబిరం
- 353 మందికి సేవలు



సేవలు అందిస్తున్న స్పెషలిస్టు వైద్యులు



రక్త పరీక్షలు చేస్తున్న వైద్య సిబ్బంది

విశాఖ విద్య: జీవీఎంసీ 90వ వార్డు బుచ్చిరాజుపాలెంలో గురువారం నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరానికి అనూహ్య స్పందన లభించింది. సచివాలయ ఆరోగ్య కార్యదర్శి, ఆశ కార్యకర్తలు కాలనీల్లో విస్తృతంగా ప్రచారం చేయడంతో వైద్య సేవలు పొందేందుకు ప్రజలు తరలివచ్చారు. వైద్య శిబిరానికి తరలివచ్చిన వారికి అసౌకర్యం కలుగకుండా తగినన్ని కుర్చీలను ఏర్పాటు చేశారు. ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేసి రోగులకు సంబంధించిన సమగ్ర వివరాల నమోదు చేశారు. వారి వివరాలను ఆన్‌లైన్ చేశారు. సేవలు పొందేందుకు వచ్చిన ప్రతీ ఒక్కరికీ ఉచితంగా మందులు అందజేశారు. 470 సచివాలయం పరిధిలోని ఇందిరా ప్రియదర్శినినగర్, సునర్లకాలనీ, భరత్ నగర్ కాలనీలకు చెందిన 353 మంది సేవలు పొందారు.

స్పెషలిస్టులతో వైద్య సేవలు

జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరానికి వచ్చే ప్రజానీకానికి మెరుగైన వైద్యం అందించేలా స్పెషలిస్టు వైద్యులను అందుబాటులో ఉంచారు. సాధారణ వైద్య సేవలతో పాటు, చెవి, ముక్కు, గొంతు, స్త్రీల వ్యాధి నిపుణులు, కంటికి సంబంధించిన వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులను అందజేశారు.

శిబిరాన్ని పరిశీలించిన అధికారులు

వైద్యశిబిరాన్ని జీవీఎంసీ 8వ జోన్ కమిషనర్ ఎం. మల్లయ్యనాయుడు సందర్శించి, ఏర్పాట్లు పర్యవేక్షించారు. ప్రతీ కౌంటర్ వద్దకు వెళ్లి వివరాలను అడిగి తెలుసుకున్నారు. వైఎస్సార్‌సీపీ పశ్చిమ నియోజకవర్గ సమన్వయ కర్త ఆడారి ఆనంద్ కుమార్ సూచనల మేరకు 90వ వార్డు వైఎస్సార్‌సీపీ నాయకుడు నమ్మి శ్రీను సహకారం అందించారు. కార్యక్రమంలో యూపీ హెచ్‌సీ ఇన్‌చార్జి మెడికల్ ఆఫీసర్ పూజిత, హెల్త్ సూపర్‌వైజర్ వరలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

మానవత్వం చాటుకున్న ఆడారి ఆనంద్

ప్రమాదంలో గాయపడిన కార్యకర్తకు రూ. 50 వేల సాయం



గాయపడిన అరుణ్‌కుమార్‌తో పార్టీ నాయకులు

మల్కాపురం: వైఎస్సార్‌సీపీ పశ్చిమ సమన్వయకర్త ఆడారి ఆనంద్‌కుమార్ మరోసారి మానవత్వం చాటుకున్నారు. సాధారణ కార్యకర్తకు అండగా నిలిచారు. ఎటువంటి ఆర్భాటం లేకుండా సాయం అందించారు.

ఇదీ పరిస్థితి

జీవీఎంసీ 60వ వార్డు బర్మాకాలనీ ప్రాంతానికి చెందిన అరుణ్‌కుమార్ వైఎస్సార్‌సీపీ సానుభూతిపరుడు. అయితే ఇటీవల అరుణ్‌కుమార్ కోరమాండల్ వద్ద రోడ్డు దాటుతుండగా కారు వేగంగా వచ్చి అరుణ్‌ను ఢీ కొట్టింది. దీంతో అరుణ్ కుడి కాలు విరిగిపోయింది.దీంతో మంచంపై లేవలేని పరిస్థితి. నిరుపేద కుటుంబానికి చెందిన అరుణ్ పూట గడవడం కష్టంగా ఉంది.దీంతో భార్య, ఏడాది బాలుడితో పడుతున్న ఇబ్బందులను తెలుసుకున్న పార్టీ నాయకుడు బిల్డర్ శ్రీను విషయాన్ని పార్టీ సమన్వయకర్త ఆడారి ఆనంద్‌కుమార్ దృష్టికి తీసుకెళ్లారు. చలించిన ఆయన తన సొంత నిధులు రూ. 50 వేలు సాయం అందించారు. ఆ మొత్తాన్ని స్థానిక నాయకులు బిల్డర్ శ్రీను,సంతోష్ తదితరులు గురువారం అరుణ్ ఇంటికి వెళ్లి అందించారు.దీంతో బాధితుడు ఆనంద్‌కుమార్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

వైఎస్సార్‌సీపీ ఎన్నికల శంఖారావం విజయవంతం చేద్దాం



కార్యక్రమంలో మాట్లాడుతున్న శ్రీనివాసరాజు

మల్కాపురం: భీమిలి నియోజకవర్గ పరిధి సంగివలసలో శనివారం జరిగే వైఎస్సార్‌సీపీ ఎన్నికల శంఖారావం సభను విజయవంతం చేయాలని ఆ పార్టీ 58వ వార్డు అధ్యక్షుడు దాట్ల శ్రీనివాసరాజు(పొడుగు రాజు) పిలుపునిచ్చారు. నక్కవానిపాలెంలోని పార్టీ క్యాంప్ కార్యాలయంలో గురువారం సాయంత్రం జరిగిన వార్డు స్థాయి కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. సిద్ధం పేరిట ఎన్నికల శంఖారావం పూరించనున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి మనమంతా తరలివెళ్లి మద్దతు తెలపాలన్నారు. ప్రతి కార్యకర్త వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ అభ్యర్థి గెలుపునకు శక్తికి మించి శ్రమించాలన్నారు. ప్రతిపక్ష పార్టీల తప్పుడు ప్రచారాలను తిప్పికొట్టి రాష్ట్రానికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేసిన మేలు, అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించాలన్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ మార్కెటింగ్ బోర్డు డైరెక్టర్ చుక్క వరలక్ష్మి, కార్యకర్తలు, నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

క్యాన్సర్ రోగికి పింఛన్ అందజేత



రోగికి పింఛన్ అందిస్తున్న కార్పొరేటర్ పి.వి.సురేష్, వార్డు అధ్యక్షుడు ఆడారి హరీష్

మల్కాపురం: జీవీఎంసీ 60వ వార్డు శ్రీహరిపురానికి చెందిన అప్పలరాజు అనే వ్యక్తి కొంత కాలంగా క్యాన్సర్‌తో బాధపడుతున్నారు. సాంకేతిక కారణాలతో ఆయనకు ప్రభుత్వం నుంచి సామాజిక పింఛన్ రాలేదు. గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా వైఎస్సార్‌సీపీ పశ్చిమ సమన్వయకర్త ఆడారి ఆనంద్‌కుమార్ ఈ ప్రాంతంలో పర్యటించినప్పుడు కార్పొరేటర్ పి.వి.సురేష్ ద్వారా అప్పలరాజు సమస్యను తెలుసుకుని, పింఛన్ మంజూరుకు హామీ ఇచ్చారు. ప్రభుత్వం నుంచి పింఛన్ మంజూరయ్యే వరకు తన సొంత నిధులతో ప్రతి నెలా పింఛన్ అందిస్తానని హామీ ఇచ్చారు. ఈ మేరకు గురువారం సాయంత్రం ఆ మొత్తాన్ని అప్పలరాజుకు కార్పొరేటర్ సురేష్, పార్టీ వార్డు అధ్యక్షుడు ఆడారి హరీష్, గుంట సుందర్రావు, హనుమంతరావు, సూర్యారావు, వర్మ, యలమంచిలి అశోక్, బుజ్జి తదితరులు అందజేశారు.

రోడ్డు ప్రమాదాల నియంత్రణకు ప్రత్యేక చర్యలు



రాంపురం బైపాస్ వద్ద ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కలిగిస్తున్న ఏసీపీ రాజీవ్‌కుమార్

పెందుర్తి: రోడ్డు ప్రమాదాలను పూర్తిస్థాయిలో తగ్గించే దిశగా ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు ట్రాఫిక్ విభాగం ఏసీపీ జి.రాజీవ్‌కుమార్ చెప్పారు. రోడ్డు ప్రమాదాల నియంత్రణ మాసోత్సవాల్లో భాగంగా గురువారం పెందుర్తి మండలం రాంపురం సమీపంలోని అనకాపల్లి–ఆనందపురం బైపాస్ వద్ద అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఏసీపీ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తే ప్రమాదాల నియంత్రణ కష్టం కాదన్నారు. పోలీస్ సిబ్బందికి వాహనదారులు సహకరిస్తేనే ప్రమాదాలను అరికట్టవచ్చని చెప్పారు. పలు అంశాలపై వాహనదారులకు అవగాహన కల్పించారు. వెస్ట్‌జోన్ ట్రాఫిక్ విభాగం సర్కిల్ ఇన్‌స్పెక్టర్ జి.శ్రీనివాసరావు, పెందుర్తి సబ్ ఇన్‌స్పెక్టర్ గుమ్మడి రమేష్, సిబ్బంది పాల్గొన్నారు.

5కేజీల గంజాయి పట్టివేత

మర్రిపాలెం: అక్రమంగా గంజాయి తరలిస్తున్న ముగ్గురిని పోలీసులు అదుపులోకి తీసుకుని రిమాండ్‌కు తరలించారు. ఐదో పట్టణ పోలీసుల వివరాలిలా..విశ్వసనీయ సమాచారం మేరకు టాస్క్‌ఫోర్స్, ఐదో పట్టణ పోలీసులు సంయుక్తంగా దాడులు నిర్వహించగా గురువారం ఉదయం 5.30 గంటల ప్రాంతంలో ఊర్వశి వద్ద తమిళనాడులోని కాంచీపురానికి చెందిన పెరుమాళ్ తియాగు, వి.కార్తీక్, చెంగల్‌పట్‌కు చెందిన గోపాల్ కన్నన్ రఘు అనే ముగ్గురు వ్యక్తులు అనుమానాస్పదంగా సంచరించడాన్ని గమనించి వారిని అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి 5 కేజీల గంజాయి,రెండు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. పాడేరులో గంజాయి కొనుగోలు చేసి తమిళనాడుకు తరలిస్తున్నట్లు విచారణలో వెల్లడైంది.

బహిరంగ ప్రకటన

[illegible]

చైల్డ్‌కేర్ కోర్సులో ఉచిత శిక్షణ

అక్కిరెడ్డిపాలెం: నిరుద్యోగ/ఒంటరి మహిళలకు ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు చైల్డ్ కేర్ కోర్సుల్లో ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు బొల్లినేని మెడ్ స్కిల్స్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సి.హెచ్.నాగేశ్వరరావు గురువారం తెలిపారు. ఈ కోర్సులో చేరేందుకు 18 నుంచి 38 సంవత్సరాల వయసు లోపు మహిళలు అర్హులని పేర్కొన్నారు. 8వ తరగతి చదివిన వారు ఈ కోర్సులో చేరవచ్చని సూచించారు. 3 నెలల శిక్షణ పూర్తయిన వెంటనే ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామన్నారు. పూర్తి వివరాలకు 7207953919, 7995013421 నంబర్లలో సంప్రదించవచ్చన్నారు.

విశాలాక్షినగర్‌లో చోరీ

ఆరిలోవ: జీవీఎంసీ 9వ వార్డు విశాలాక్షినగర్‌లోని ఓ ఇంట్లో దొంగతనం జరిగింది. ఆరిలోవ క్రైం ఎస్.మురళీకృష్ణ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. జాతీయ రహదారి పక్కన వెటర్నరీ వైద్యుల లేఅవుట్‌లోని ఓ ఇంట్లో బ్యాంక్ ఉద్యోగి మూర్తి అద్దెకు ఉంటున్నారు. ఆయన కుటుంబ సభ్యులు సంక్రాంతికి ఊరెళ్లారు. మూర్తి బుధవారం ఉదయం ఇంటికి తాళం వేసి డ్యూటీకి వెళ్లి సాయంత్రం తిరిగి వచ్చారు. ఇంటి తాళం పగులగొట్టి తలుపులు తెరిచి ఉండడంతో అనుమానం వచ్చి లోపల పరిశీలించారు. బీరువా తలుపులు తెరిచి అందులో ఉన్న ఒక టెన్నర తులాల బంగారు వస్తువులు, రూ.5 వేలు నగదు కనిపించ లేదు. దీంతో అదేరోజు రాత్రి బాధితుడు ఆరిలోవ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఆయన ఇచ్చిన ఫిర్యాదుతో క్రైం పోలీసులు క్లూస్ టీంను రప్పించి సంఘటన స్థలాన్ని పరిశీలించారు. ఆ ఇంటికి సమీపంలో ఉన్న సీసీ కెమెరాల ఫుటేజీలను కూడా పోలీసులు పరిశీలించారు. ఆ ఫుటేజీలో ఆరుగురు వ్యక్తులు రెక్కీ నిర్వహించి చోరీకి పాల్పడినట్లు గుర్తించారు. మొదట ఒక వ్యక్తి స్కూటీపైన వెళ్లిన కొంత సేపటికి మరో ఇద్దరు బైక్‌పై వెళ్లి ఆ ఇంటిని కొంతసేపు బయట నుంచి పరిశీలించారు. అనంతరం వాళ్లు వెళ్లిన కొద్ది సేపటికి మరో ముగ్గురు నడుచుకుంటూ వెళ్లి ఆ ఇంట్లోకి చొరబడి దొంగతనానికి పాల్పడినట్లు గుర్తించారు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ మురళీకృష్ణ తెలిపారు. ఇటీవల కాలంలో ఇక్కడి వెటర్నరీ కాలనీలో దొంగతనం జరగడం ఇది మూడోసారి కావడం విశేషం.